నమస్తే తెలంగాణ
# వరంగల్
3 | వరంగల్, బుధవారం 9 అక్టోబర్ 2024 | WARANGAL



ములుగు జిల్లా కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఉన్న 2023 నాటి బతుకమ్మ చీరలు

# బతుకమ్మ చీరెలు పండుగ తర్వాతే..

## ఇప్పుడు వచ్చినవి పంపిణీ చేయొద్దని ఆదేశాలు

**బతుకమ్మ.. తెలంగాణ ఆడబిడ్డలకు అతిపెద్ద పండుగ. సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక అయిన పూల పండుగను సంబురంగా జరుపుకోవాలని కోరుకునే ప్రతి మహిళ కు కాంగ్రెస్ ప్రభుత్వం నిరాశను మిగిల్చింది. పండుగను వైభవంగా నిర్వహించుకునేందుకు గత కేసీఆర్ సర్కారు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయడంతో పాటు ఏటా 18 ఏళ్లు నిండిన వారందరికీ పండుగకు ముందే చీరెలు పంపిణీ చేస్తే రేవంత్ సర్కారు మాత్రం పండుగను చిన్నచూపు చూస్తోంది. ఇటీవల ఆరు జిల్లాలకే( ములుగు, మహబూబాబాద్ సహా) చీరెలను పరిమితం చేసి రెండు రోజులు హడావిడి చేసిన సర్కారు.. మంగళ వారం నుంచి పంపిణీ నిలిపివేసి పండుగ తర్వాత ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చింది. మిగతా 27 జిల్లాల మహిళ ల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని భావించి వెనుకడుగు వేసింది. అయితే పండుగ అయిపోయిన తర్వాత బతుకమ్మ చీరెలు ఇవ్వడం ఎందుకుని ఆడ బిడ్డలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో చీరెలు మళ్లీ మూలనపడగా, అధికారులు సైతం పునరాలోచనలో పడ్డారు.**

*- ములుగు, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ)*



ములుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మూలన పడేసి ఉన్న బతుకమ్మ చీరెలు

- మొన్న ఆరు జిల్లాలకేనంటూ సర్కారు ప్రకటన
- 27 జిల్లాల ఆడబిడ్డల ఆగ్రహం తప్పదని వెనుకడుగు
- పంపిణీ ఆపాలని టీఎస్‌హెచ్‌డబ్ల్యూ ఎస్ ఎండీ ఉత్తర్వులు
- ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో నిలిచిన చీరెల పంపిణీ
- అనాలోచిత నిర్ణయాలతో పండుగ పూట మహిళ ల నిరాశ



ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగకు ఆడబిడ్డలకు చీరెలు కరువయ్యాయి. పండుగ తర్వాత చీరెలను పంపిణీ చేస్తామని జీవోను జారీ చేయడంతో ఆడబిడ్డలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండుగ వస్తుందని ప్రభుత్వానికి తెలియదా? పండుగ అయిపోయినంక ఇచ్చి ఎందుకని చీవాట్లు పెడుతున్నారు. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్రంలోని ములుగు జిల్లాతో పాటు మరో ఐదు జిల్లాలకు చీరెల పంపిణీ చేపట్టగా ముచ్చటగా రెండు రోజులకే ఆగిపోయింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఉన్న ఆడబిడ్డల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని భావించిన ప్రభుత్వం ఈ ఆరు జిల్లాల్లో సైతం మొత్తానికే చీరెల పంపిణీ నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేస్తూ జీవోను విడుదల చేయడంతో గ్రామ పంచాయతీలకు చేరిన చీరెలు స్టోర్ రూమ్‌లలో మూలుగుతున్నాయి. అధికారులు సైతం చేసేదేమీ లేక వచ్చీపోయే మహిళలకు సమాధానాలు చెప్పలేక సతమతమవుతున్నారు. పండుగ అయిపోయిన తర్వాత 15వ తేదీ నుంచి చీరెల పంపిణీ ఉంటుందని వారికి సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు.

**ఆడబిడ్డల ఆగ్రహం తప్పదని..**

బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని ఆరు జిల్లాల స్వయం సహాయక సంఘంలోని మహిళా సభ్యులకు, 18 ఏళ్లు నిండిన గిరిజన ఆడబిడ్డలకు బతుకమ్మ చీరెల పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ నెల 6న ములుగు, మహబూబాబాద్, ఆదిలాబాద్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల జిల్లాల మహిళలకు ఇచ్చేందుకు రాష్ట్ర చేనేత సహకార సంఘం నుంచి చీరెలను సరఫరా చేసింది. గత ప్రభుత్వ హయంలో ఎన్నికల సందర్భంగా పంపిణీ చేయకుండా చేనేత సహకార సంఘం వద్ద మిగిలి ఉన్న బతుకమ్మ చీరెలకు అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫొటోలను, బతుకమ్మ చీరెల పేరును మార్చి తెలంగాణ ఆడపడుచుల చీరెల పంపిణీ పథకం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఫొటోలతో స్టిక్కర్లను అంటించి ప్యాకింగ్ చేసిన చీరెలు ఆయా జిల్లాలకు చేరాయి. ఈ నెల 7న మహిళా సంఘాల వీఓ గ్రూప్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు, గిరిజన ఆడబిడ్డలకు పంపిణీని ప్రారంభించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరెలే ఇప్పుడు ఇచ్చారని, వాటికి వీటికి తేడా లేదని, పేరు, ఫొటోలు మార్చి ఇవ్వడం ఏమిటని తీసుకున్న మహిళలు ఆవేదనతో వెళ్లినట్లు తెలిసింది. అందరికీ ఇవ్వకుండా కొందరికి ఈ మాత్రం ఎందుకు ఇవ్వాలని బాహాటంగానే అన్నట్లు సమాచారం. కేవలం ఆరు జిల్లాల్లోనే ఇస్తే రాష్ట్రంలోని మిగతా ఆడబిడ్డల నుంచి ఆగ్రహం తప్పదని ప్రభుత్వం భావించగా అప్పటికప్పుడు రాష్ట్ర చేనేత సహకార సంఘం ఎం.డీ శైలజా రామయ్యర్ ఉత్తర్వులను జారీ చేసి ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపించారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు చీరెల పంపిణీ నిలిపివేశారు. కాగా, ఉత్తర్వుల్లో బతుకమ్మ పండుగ తర్వాత ఈ నెల 15 నుంచి చీరెలు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మొత్తానికి అధికారుల అనాలోచిత చర్యలతో బతుకమ్మ పండుగకు ఎంపిక చేసిన ఆరు జిల్లాలోని మహిళలతో పాటు ఇతర జిల్లాలోని మహిళలకు తీవ్ర నిరాశ ఎదురైందని చెప్పవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో కాంగ్రెస్ ప్రభుత్వం మరోమారు ప్రభుత్వ పథకాల అమలులో విఫలమైందని ఆడబిడ్డలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పచ్చదనాన్ని పెంపొందించేందుకే..

**మేడారంలో 'మొక్క ముడుపు' ప్రారంభంలో పూజారి జగ్గారావు**



మేడారంలో తల్లుల గద్దెల ఆవరణలో మొక్క నాటుతున్న పూజారులు, గ్రామస్తులు

తాడ్వాయి, అక్టోబర్ 8 : ప్రకృతి దేవతలు సమ్మక్క – సారలమ్మలు కొలువైన మేడారం, చుట్టుపక్కల గ్రామాల్లో పర్యావరణానికి ముప్పు తెస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించి, పచ్చదనం పెంపొందించేందుకే మొక్క ముడుపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు తెలిపారు. మంగళవారం తొలుత అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్న తర్వాత గద్దెల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం నార్లాపురం చింతల్‌క్రాస్ వద్ద మొక్క ముడుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివాసీ నృత్యాలతో ఆడిపాడారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి దేవతలు కొలువైన మేడారంలో పచ్చదనం ఉట్టిపడేలా ప్రజలందరూ మొక్కలు పెంచుతూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు.

# ఇసుక లారీలను అడ్డుకున్న రైతులు

- ఎడ్లబండి, బ్లేడ్ బండి అడ్డుపెట్టి నిరసన
- దుమ్ము పడి దెబ్బతింటున్న మిర్చి తోటలు



రోడ్డుకు అడ్డంగా ఎడ్ల బండి పెట్టిన రైతులు

వాజేడు, అక్టోబర్ 8 : మండలంలోని ధర్మవరంలో మిర్చి చేన్ల మీదుగా రాంపురం ఇసుక ర్యాంపునకు లారీల రాకపోకలతో దాదాపు 200 ఎకరాల్లో మిర్చి చేన్లపై దుమ్ము పడి దెబ్బతింటున్నాయి. దీంతో ఆగ్రహించిన రైతులు మంగళవారం ఎడ్ల బండి, బ్లేడు ట్రాక్టర్ అడ్డు పెట్టి లారీలను గంట పాటు నిలిపివేశారు. రాంపురం ఇసుకను అక్రమంగా ధర్మ వరం సమీపంలో నిల్వ చేసి తమ పంట చేల మీదుగా లారీల్లో తరలిస్తుండడం, రహదారి క్యూరింగ్ చేయకపో వడంతో రైతులు లారీలను అడ్డుకున్నారు. దీంతో రైతుల ను బుజ్జగించి మళ్లీ లారీలు తిప్పుతున్నట్లు సమాచారం. ఇసుకను అక్రమంగా డంప్ చేసి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ధర్మవరం నుంచి ఇసుక లారీలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తుడు బొల్లె దేవా మండల కేంద్రానికి వచ్చిన భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుకు ఫిర్యాదు చేశారు. ఇసుక ర్యాంపుల వల్ల పంటలు దెబ్బతిన కుండా చూస్తానని హామీ ఇచ్చారు. పంట చేన్లు దెబ్బతింటున్నందున టీఎండీసీ అధికారులు చొరవ చూపి ధర్మవరం నుంచి లారీలు తిరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

# ప్రభుత్వ భూములకు నాలా కన్వర్షన్

**అనుమతుల కోసం జోరుగా పైరవీలు**

- ఇప్పటికే శిఖం భూమికి అనుమతులు
- భూపాలపల్లి జిల్లాలో యథేచ్ఛగా రియల్ దందా
- 57 ఎకరాల్లో ఇల్లీగల్ ప్లాటింగ్
- వెంచర్లుగా మారుతున్న వ్యవసాయ భూములు
- అవగాహన లేక నష్టపోతున్న కొనుగోలుదారులు



గోరంట్లకుంట చెరువు శిఖం భూమిలో నాలా అనుమతితో చేసిన వెంచర్

జయశంకర్ భూపాలపల్లి. అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధికారులు నాలా అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలోని చెరువు శిఖం భూమికి ఓ రెవెన్యూ అధికారి నాలా అనుమతి ఇవ్వడం దీనికి బలం చేకూరుస్తున్నది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ, సర్కారు భూముల్లో వెంచర్లు చేయడానికి నాలా అనుమతుల కోసం జోరుగా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే చెరువు శిఖం భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి ప్లాట్లు చేసి విక్రయించిన రియల్ వ్యాపారులు అదే దారిలో మరో అడుగు ముందుకు వేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో 57 ఎకరాల్లో 13 ఇల్లీగల్ వెంచర్లు చేసి ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారు. అయితే అధికారుల నుంచి చర్యలు లేకపోవడంతో రియల్టర్లు తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా వ్యవసాయ భూములు ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లుగా మారుతున్నాయి.

**చెరువు శిఖానికి నాలా అనుమతి**

భూపాలపల్లి మండలం కొంపెల్లి శివారు 209 సర్వే నంబర్‌లోని గోరంట్ల కుంట చెరువు శిఖానికి రెవెన్యూ అధికారులు నాలా అనుమతి ఇచ్చినట్లు నీటి పారుదలశాఖ అధికారులు గుర్తించారు. చెరువు శిఖం మొత్తం 22.32 ఎకరాలు ఉండగా ఇందులో నాలుగు ఎకరాలు కబ్జాకు గురైనట్లు తెలిపారు. ఇదే సర్వే నంబర్‌లో వేంకటేశ్వర దేవాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్ అండ్ బీ అతిథి గృహాన్ని సుమారు 5 ఎకరాల్లో నిర్మించారు. కాగా, మరో 3.32 ఎకరాల్లోని శిఖం భూమి ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లింది. 209 సర్వే నంబర్‌లో చెరువు శిఖం భూమి ఉండగా పక్కనే 213, 208 సర్వే నంబర్లలో పట్టా భూములు ఉన్నాయి. ఇది అక్రమార్కులకు కలిసొచ్చింది. 208, 213 సర్వే నంబర్ల పేరుతో చెరువు శిఖం భూమికి రెవెన్యూ అధికారుల నుంచి నాలా అనుమతి పొంది ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించారు. గత కొన్నేళ్లుగా ఈ ఆక్రమణ తతంగం జరుగుతున్నప్పటికీ, ఇటీవలి కాలంలోనే రియల్ వ్యాపారులు ఓ రెవెన్యూ అధికారి కనుసన్నల్లో నాలా అనుమతి పొంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపితే మరిన్ని సర్కారు భూములు బయటపడే అవకాశం ఉందని స్థానికులు చెప్పుకుంటున్నారు. గోరంట్లకుంట సమీపంలో సుమారు 10 గుంటల చెరువు శిఖం భూమిని ఓ పోలీస్ అధికారి కొనుగోలు చేసినట్లు సమాచారం.

**57 ఎకరాల్లో.. 13 అక్రమ వెంచర్లు**

జిల్లా కేంద్రంలో 57 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా 13 వెంచర్లు చేశారు. గుడ్ మార్నింగ్ స్కూల్ సమీపంలో 143 సర్వే నంబర్‌లో రెండు ఎకరాల్లో ఒక వెంచర్, కేటీకే 8 ఇంక్లైన్ రోడ్డులో 172,173 సర్వే నంబర్లలో రెండు ఎకరాల్లో ఒకటి, కుందూరుపల్లి గ్రామ రోడ్డు వెంట 174, 175 సర్వే నంబర్లలో నాలుగు ఎకరాల్లో మూడు, 181 సర్వే నెంబర్‌లో ఐదు ఎకరాల్లో ఒకటి, ఏఎస్ఆర్ గార్డెన్ వెనుక వైపు 309, 310, 319, 320 సర్వే నెంబర్లలో 25 ఎకరాల్లో మూడు, సన్‌వ్యాలీ పాఠశాల దగ్గర 146 సర్వే నెంబర్‌లో 14 ఎకరాల్లో మూడు, భాస్కర్‌గడ్డలో 361 సర్వే నంబర్‌లో ఐదు ఎకరాల్లో ఒక వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్రమార్కుల దృష్టి పట్టణంలోని 170 సర్వే నంబర్లపై పడింది. ఈ సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూమికి పట్టాలు ఇవ్వడంపై రెవెన్యూ అధికారులు విచారణ జరుపుతున్నారు.

**విచారణ జరుపుతాం..**

ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములకు నాలా అనుమతి ఇవ్వడం కుదురదు. అలా అనుమతి ఇవ్వడం నేరం. విచారణ జరుపుతాం. ఎక్కడైనా అలా జరిగితే చర్యలు తీసుకుంటాం. అలాగే చెరువు శిఖం భూమికి నాలా అనుమతి ఇవ్వడంపై విచారణ చేపడుతాం. గోరంట్లకుంట శిఖంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే ఊరుకోం.

**– మంగీలాల్. ఆర్డీవో, భూపాలపల్లి**



అయోధ్యపురంలో నిర్మాణంలో ఉన్న వ్యాగన్ మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు

- కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటుకు రైల్వే శాఖ యత్నం..
- ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్న వ్యాగన్ తయారీ యూనిట్
- అదనంగా రూ.66కోట్ల కేటాయింపు.. టెస్ట్ షాప్ షెడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

# కాజీపేటలో వందేభారత్ బోగీలు?

కాజీపేట, అక్టోబర్ 8 : ప్రస్తుతం రైల్వేశాఖ అతి తక్కువ సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంపై దృష్టి సారించింది. అందులో భాగంగా రెండేళ్ల క్రితం ప్రధాని మోదీ వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టారు. కాజీపేటలోని వ్యాగన్ వర్క్‌షాప్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేసి అందులోనే వందేభారత్ కోచ్‌లను తయారు చేయాలని రైల్వేశాఖ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి కేటాయించిన నిధులతో పాటు మరో రూ.66 కోట్లను అదనంగా మంజూరు చేసి, (కొత్త ప్రాజెక్ట్) టెస్ట్ షాప్ షెడ్‌ను నిర్మించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలను జారీ చేసినట్లు సమాచారం.

**శరవేగంగా యూనిట్ నిర్మాణం..**

కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలోని అయోధ్యపురం వద్ద చేపట్టిన వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ షెడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అయోధ్యపురంలో 160 ఎకరాల్లో రూ.521కోట్లతో నిర్మిస్తున్న ఈ యూనిట్ షెడ్డును కోచ్ షెడ్డుగా అప్‌గ్రేడ్ చేయాలని మరో రూ.361.79 కోట్ల నిధులను రైల్వేశాఖ మంజూరు చేసింది. పనులను ఆర్‌వీఎన్‌ఎల్ (రైల్వే వికాస్ నిగం లిమిటెడ్) కు అప్పగించగా, పవర్ మెక్ ప్రాజెక్టు సంస్థ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. 2010–11 రైల్వే బడ్జెట్‌లో అప్పటి కేంద్ర ప్రభుత్వం అయోధ్యపురంలో 55 ఎకరాల్లో వ్యాగన్ రిపేరింగ్ వర్క్‌షాప్‌ను మంజూరు చేసింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ పలుమార్లు ప్రధానమంత్రి మోదీని ఎంపీలతో కలిసి కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మోదీ ఏడాదిన్నర క్రితం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు నగరానికి వచ్చినప్పుడు కాజీపేట వ్యాగన్ రిపేరింగ్ వర్క్‌షాప్‌ను వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం అయోధ్యపురంలో 160 ఎకరాల్లోని సగభాగంలోనే నాలుగు షెడ్ల నిర్మాణ పనులు పుంజుకున్నాయి. ప్రతిరోజు 600 మంది కాంట్రాక్టు కార్మికులతో షెడ్లు, బిల్డింగ్‌లు, మెయిన్ లైన్, ఎనిమిది సబ్ రైలు పట్టాల ఏర్పాటు పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. మెయిన్ షెడ్, పెయింట్ బూత్ షెడ్, స్టోర్స్ వార్డు, టెస్ట్‌షాప్ షెడ్లలో కొన్ని పనులు పూర్తి కావచ్చాయి. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, క్యాంటీన్, రెస్ట్ హౌస్ బిల్డింగ్‌ల నిర్మాణం జరుగుతున్నది. షెడ్యూల్ ప్రకారం 2025 ఫిబ్రవరిలో పనులు పూర్తి కావాల్సి ఉండగా, ఆగస్టు వరకు పూర్తి అవుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. దీని నిర్మాణం పూర్తయితే రైల్వేలోని దాదాపు 20 నుంచి 30 రకాల వ్యాగన్ బోగీలు తయారు కానున్నాయి. ప్రత్యేక్షంగా 4వేల మంది కార్మికులు, పరోక్షంగా మరో 4 వేల మదికి ఉపాధి దొరుకనున్నది.

**కోచ్ ఫ్యాక్టరీకి రైల్వేశాఖ యత్నం?**

వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ స్థలంలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టేందుకు రైల్వే శాఖ అంతర్గతంగా సన్నాహాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ యూనిట్‌కు కేటాయించిన స్థలంలో దాదాపు సగం స్థలం వృథాగానే ఉండనున్నది. కాగా, ఈ ప్రాంత ప్రజల 45 ఏళ్ల చిరకాల ఆకాంక్షను దృష్టిలో పెట్టుకుని కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే అన్ని విధాలా బాగుంటుందని, ఎన్‌హెచ్ 163 సమీపంలోనే ఉండడంతో నిర్మాణ ఖర్చుల భారం తగ్గుతుందనే అంచనాతో రైల్వేశాఖ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి.

# ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

- సాధించాలనే పట్టుదలతో దీప్తి కాంస్య పతకం
- ద్రోణాచార్య అవార్డుగ్రహీత, భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపూరి రమేశ్
- జేఎన్ఎస్‌లో ముగిసిన 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు
- 100 మీటర్స్‌లో హనుమకొండకు చెందిన కైఫ్‌కు గోల్డ్ మెడల్



డిస్కస్‌త్రో విజేతలకు మెడల్స్ అందజేస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి, గట్టు మహేశ్‌బాబు



ద్రోణచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేశ్, పారాఒలింపిక్స్ కాంస్య పతకం విజేత దీప్తి జీవన్‌జీ

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 8 : ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని, సాధించాలనే పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా ఛేధించవచ్చని ద్రోణాచార్య అవార్డుగ్రహీత నాగపూరి రమేశ్ అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. 100 మీటర్స్‌లో హనుమకొండకు చెందిన కైఫ్ గోల్డ్ మెడల్ సాధించాడు. రెండోరోజు జరిగిన పోటీల్లో హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఆర్యవైశ్య రాష్ట్ర అధ్యక్షుడు గట్టు మహేశ్ బాబు పాల్గొని విజేతలకు మెడల్స్ అందజేశారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ద్రోణాచార్య అవార్డు గ్రహీత, భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపూరి రమేశ్, పారాఒలింపిక్స్ కాంస్య పతకం విజేత దీప్తి జీవన్‌జీ పాల్గొని విజేతలకు మెడల్స్ అందించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ పారాఒలింపిక్స్‌లో దీప్తి కాంస్య పతకం సాధించి ప్రపంచంలోనే ఓరుగల్లు ఖ్యాతిని చాటి చెప్పిందని గుర్తుచేశారు. దీప్తికి పేదరికం అడ్డురాలేదని వైకల్యంతో కుంగిపోకుండా పతకం సాధించిందన్నారు. దీప్తి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులకు అండగా ఉండి ప్రోత్సహించాలన్నారు. పారాఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వరద రాజేశ్వర్‌రావు, వరంగల్ అధ్యక్షుడు మూగల కుమార్‌యాదవ్, డాక్టర్ మురళీధర్, పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, వంశీరెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్‌లు పాల్గొన్నారు.

**విజేతలు వీరే..**

- బాయ్స్ అండర్–18 100 మీటర్స్ పరుగుపందెంలో గణేశ్(నల్గొండ, గోల్డ్ మెడల్), ఎస్ హర్షవర్ధన్ (రంగారెడ్డి, సిల్వర్), కత్తి అశోక్ (ఖమ్మం, బ్రౌంజ్)
- బాయ్స్ అండర్–20 100 మీటర్స్ పరుగు పందెంలో ఎండీ కైఫ్ (హనుమకొండ, గోల్డ్), జీ రాఘవేంద్ర (వనపర్తి, సిల్వర్), జీ గణేశ్(మెద్చల్, బ్రౌంజ్)
- బాయ్స్ అండర్–20 జావెలిన్‌త్రోలో కే స్వామి (కరీంనగర్, గోల్డ్), పీ నగేశ్ (సిద్ధిపేట, సిల్వర్), ఆర్ తరుణ్‌కుమార్ (నాగర్‌కర్నూల్, బ్రౌంజ్)
- గర్ల్స్ అండర్–18 100 మీటర్స్ పరుగు పందెంలో షేక్‌సుహాని (హైదరాబాద్, గోల్డ్), ఎం అక్షిత (రంగారెడ్డి, సిల్వర్), అమ్న అంజుమ్ (మంచిర్యాల, బ్రౌంజ్)
- గర్ల్స్ అండర్–20 100 మీటర్స్ పరుగు పందెంలో ఎన్ ప్రవళిక (నల్లగొండ, గోల్డ్), రాగవర్షిణి (హైదరాబాద్, సిల్వర్), మాల శృతి (నాగర్‌కర్నూల్, బ్రౌంజ్) గెలుచుకున్నారు.



# వామ్మో.. వెల్లుల్లి

**రూ.400లకు చేరిన ధర**

మహబూబాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : వెల్లుల్లి కొండెక్కింది. గత పది రోజుల్లోనే రూ.100 పైగా పెరిగింది. ఇప్పటికే ఉల్లి గడ్డ ధరలో ఆకాశాన్నంటుతుండగా, వెల్లుల్లి సామాన్య జనం కొనలేని పరిస్థితి ఎదురైంది. పండుగ సీజన్ కావడంతో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. అందులోనూ వెల్లుల్లి ధర మరీ చెప్పలేనిది. వెల్లుల్లిలో నాలుగు రకాలుండగా మామూలు రకం పది రోజుల క్రితం కిలోకు రూ. 140 ఉండగా, ప్రస్తుతం రూ.280లకు చేరింది. మీడియం రూ. 160 ఉండగా ప్రస్తుతం రూ.320, పెద్ద రకం కిలోకు రూ.180 నుంచి రూ.200 ఉండగా రూ.400లకు చేరింది. ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలకు మహారాష్ట్రలో వెల్లుల్లి పంట ఎక్కువ స్థాయిలో దెబ్బతింది. ఈ నేపథ్యంలో ఒకే సారి ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో పెరిగిన ధరలతో ఎల్లిగడ్డ కొనాలంటే జనం జంకుతున్నారు. దసరా పండుగ నేపథ్యంలో పెరిగిన ధరలు పేద మధ్య తరగతి ప్రజలపై అదనపు భారం పడనుంది.

# ఉద్యోగాల పేరుతో యూత్ కాంగ్రెస్ నేత దందా

- మహిళ వద్ద రూ.2 లక్షలు తీసుకొని మోసం చేసిన పవన్
- డబ్బులు అడిగితే అనుచరుడితో బెదిరింపులు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని అనుచరుడి ఆగడాలు



బాధితురాలికి రూ.1.30లక్షలకు తోట పవన్ ఇచ్చిన రసీదు



తోట పవన్

సుబేదారి, అక్టోబర్ 8 : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరుడు, యూత్ కాంగ్రెస్ నేత తోట పవన్ ప్రభుత్వ ఉద్యోగాలు పేరుతో దందాలకు పాల్పడుతున్నాడు. ఈ ఘటన హనుమకొండలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి భర్త కాల్ రికార్డ్సుతో ఉన్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ రంగంపేటకు చెందిన గన్నారాపు సుమలతకు హనుమకొండలోని మార్కజీ ప్రభుత్వ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తోట పవన్ మధ్యవర్తి శివ ద్వారా ఎన్‌జీవోస్ కాలనీలోని తన సాయి పవన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆఫీస్‌లో సుమలత భర్త నుంచి రూ.2 లక్షలు తీసుకొని, రూ.1.30 లక్షలకు రసీదు ఇచ్చాడు. నాలుగు నెలలు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితురాలి భర్త పవన్‌ను అడిగితే అనుచరుడి ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల అనుచరుల దందాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మంత్రి అనుచరుడు పోలీసుల అండతో సెటిల్‌మెంట్లు, భూ దందాలు, అధికార పార్టీ క్యాడర్‌ను పోలీసులతో కొట్టించిన ఘటనలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా వరంగల్ పశ్చిమ నియోజక వర్గం లో ఎమ్మెల్యే అనుచరుడి ఉద్యోగాల దందా వెలుగులోకి వచ్చింది.

**ఉద్యోగం ఇప్పిస్తానని పవన్ రూ.2 లక్షలు తీసుకున్నాడు**

నాలుగు నెలల క్రితం తోట పవన్ తన భార్యకు హనుమకొండలోని మర్కాజీ ప్రభుత్వ పాఠశాలలో ఔట్ సోర్సింగ్ అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆయన ఆఫీసులో రూ.2 లక్షలు తీసుకున్నాడు. ఇందులో రూ.1. 30 లక్షలకు రసీదు ఇచ్చాడు. నాలుగు నెలలు గడిచినా ఉద్యోగం ఇప్పించలేదు. మా డబ్బులు మాకు ఇవ్వాలని పవన్‌కు చాలా సార్లు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదు. పైగా అతడి అనుచరుడు సంజయ్‌పటేల్ ద్వారా వాట్సాప్ కాల్ చేసి బెదిరిస్తున్నాడు. ఎమ్మెల్యే, పోలీస్ అధికారులు మాకు న్యాయం చేయాలి.

**– బాధితురాలి భర్త గన్నారాపు ప్రదీప్‌రాజ్**